క్లుప్తంగా

ఆది గురువు జాంబవ దేవునికి పూజలు



నగరంపాలెం: గురు పౌర్ణమి సందర్భంగా అరండల్‌పేట శ్రీమోహన్‌రంగనాయక స్వామి వారి దేవస్థానంలో ఆది గురువు జాంబవ (మాదిగ) దేవునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మీడియాతో మాట్లాడారు. ఆది గురువు జాంబవ మాదిగ దేవునికి గురుపౌర్ణమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. టీటీడీ దేవస్థానంలో మాదిగ పూజారులకు గౌరవ వేతనం అందించి హైందవ సంస్కృతిని విస్తృత ప్రచారం చేయాలన్నారు. జాంబవ మహర్షికి నలభై మంది మాదిగ పూజారులు వైభవంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు చావలి బాలస్వామి, అత్తోట జోసెఫ్‌కుమార్, దాసరి జాన్‌బాబు, తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకులు టి.వంశతిలక్, వెంకటనరసయ్య, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ప్రధాన అర్చకులు రామయ్య, తమిళనాడుకు చెందిన ప్రత్యేక పూజారి మురిగేశన్, జాంబవంతుని భక్తులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం

గుంటూరు మెడికల్: గురు పౌర్ణమి సందర్భంగా గురువారం గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కార్యాలయంలో యోగా గురువు జుజ్జూరు శ్రీనివాసరావు దంపతులకు గురుపూజ చేసి సన్మానించారు. గత 40 రోజులుగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు యోగాలో పాల్గొంటున్న వారికి శ్రీనివాసరావు ఎన్నో మెలకువలు నేర్పించాని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. ప్రజలకు యోగాతోపాటు ఆరోగ్యం, ఆహారం, మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించి జీవనశైలిలో వాటిని ఎలా ఉపయోగించుకోవాలి వివరించారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వెల్లడించారు. ప్రజలందరూ ఆరోగ్యం పై దృష్టి సారించి గురువుల్ని స్మరించుకొని వారి అడుగుజాడల్లో జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఖాతాదారుల ఉన్నతికి కృషి

యూబీఐ రీజినల్ హెడ్ జవహర్



కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారుల ఉన్నతికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) కృషి చేస్తోందని బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ తెలిపారు. జీటీ రోడ్ లోని బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం క్రెడిట్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ యూబీఐ ద్వారా విదేశాల్లో విద్యాభ్యాసం కోసం రూ.40 లక్షల వరకు విద్యా రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ అందిస్తున్న వడ్డీ రేటు కూడా ఇతర బ్యాంకులతో పోల్చితే చాలా తక్కువగా ఉందని వెల్లడించారు. ఎంఎస్‌ఎంఈ, వ్యవసాయ రంగం, కోల్డ్ స్టోరేజీలు, రూరల్ గోడౌన్లు, నిర్మాణ పనులు తదితర రంగాలకు రుణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యా రుణాలు, హౌసింగ్ లోన్లు, బిజినెస్ లోన్లకు సంబంధించిన రుణ మంజూరు పత్రాలను ఖాతాదారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్‌లు ఎ.రాజేష్, అశ్వర్థ నాయక్, ఏజీఎం హరేరాం షా తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె



నగరంపాలెం: స్థానిక సంగడిగుంట కనకదుర్గ అమ్మవారి గుడి ఆవరణలో గురువారం ఆషాఢ మాస సారె వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా సంగడిగుంట వేంకటేశ్వరస్వామి గుడి నుంచి రెడ్లబజార్ మీదగా మహిళలు, కనకదుర్గ పారాయణ సభ్యులు కనకదుర్గ అమ్మవారి గుడి వద్దకు తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆషాఢ మాస సారెను సమర్పించారు. కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు మూరెడ్డి శ్రీనివాసరెడ్డి (రూప), కార్యదర్శి మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆరవ ఆంజినేయులు, కోశాధికారి కల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పత్రి అప్పారావు, అరవపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో చినకాకాని జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు దాతలు నోటు పుస్తకాలను గురువారం అందజేశారు. సుమారు 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను దాతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రమేష్ పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గురుపౌర్ణమి సందర్భంగా గురువారం గుంటూరు పట్టాభిపురంలోని మందిరంలో సాయినాథునికి హారతులు ఇస్తున్న భక్తులు



బ్రాడీపేట మందిరంలో పూల అలంకరణలో సాయిబాబా



విద్యానగర్ సాయి మందిరంలో పూల అలంకరణలో..



సాయిబాబాను దర్శించుకుని పూజలు చేస్తున్న భక్తులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

భక్తిశ్రద్ధలతో వ్యాసపౌర్ణమి వేడుకలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వ్యాసపౌర్ణమి వేడుకలు జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుడిమెళ్ల కూర్మనాథస్వామి ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించారు. కూర్మనాథ స్వామి ప్రసంగిస్తూ వేదాలను నాలుగు భాగాలుగా విభజించారని అన్నారు. తద్వారా వాటిని అధ్యయనం చేయడం సులభతరం చేసిన మహా రుషి వేదవ్యాసులని పేర్కొన్నా రు. పద్దెనిమిది పురాణాలను పంచమవేదమైన మహాభారతాన్ని, భాగవతం వంటి అనేక పురాణాల కథలను రచించి సాహిత్యం, ఆధ్యాత్మిక రంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆషాఢ పౌర్ణమిని గురుపౌర్ణమిగా వ్యాస భగవానుడిని పూజించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు.



మాట్లాడుతున్న కూర్మనాథ స్వామి

ముగిసిన గురుపూర్ణిమ ఉత్సవాలు

స్థానిక విద్యానగర్ మూడో వీధిలో వేంచేసిన శ్రీసాయినాథ సన్నిధానంలో గురు పూర్ణిమ ఉత్సవాలు గురువారం ముగిశాయి. గురుపూర్ణిమ సందర్భంగా సాయినాథునికి ఏకాదశ అభిషేకం, విశేష అర్చనలు జరిగాయి. విశేష అలంకరణతో సాయినాథుని దర్శనం ప్రారంభమైంది. వందలాది భక్తులు స్వామి వారి అభిషేకంలో పాల్గొని, సాయినాథుని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమా రాధన చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామ కృష్ణయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.



విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానం వద్ద బారులు తీరిన భక్తులు

భారతీయుల తొలి గురువు వ్యాస మహర్షి

లక్ష్మీపురం: జ్ఞాన భాండాగారంగా పంచమ వేదంగా ప్రసిద్ధిగాంచిన మహా భారతాన్ని ప్రపంచానికి అందించిన వ్యాస మహర్షి భారతీయుల తొలిగురువని ఆయన జన్మదినాన్ని గురు పౌర్ణమిగా అనాది నుంచి భారతీయ సమాజం జరుపుకొంటుందని రంగ స్థల నటుడు పి.ఘనశ్యామాచార్యులు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది నుంచి హిందూ సమాజం వేద వ్యాసుడ్ని తొలి గురువుగా భావిస్తుందన్నారు. ప్రముఖ గాయని యార్లగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ భారత దేశంలో గురువుకి విశేషమైన స్థానం ఉందని, సమాజ క్షేమానికి ఒక ఉత్తమ గురువు తాను శ్రమ పడి సంపాదించిన జ్ఞానాన్ని అర్హత గల వారికి అందిస్తూ తనతో సమానమైన ఎందరో శిష్యులను తీర్చి దిద్ది సమాజానికి ఉపకారం చేస్తారన్నారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చలమయ్య కళాశాల ఆధ్వర్యంలో...

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించుకునే విశిష్టమైన రోజే గురు పౌర్ణమి అని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం చలమయ్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ వేదాలను విభజించి మహాభారతం, పురాణాలను రచించిన వ్యక్తిగా వేద వ్యాసుడిని కొలుస్తారని, వేదవ్యాసుని జన్మదినంగా గురు పౌర్ణమిని జరుపుకొంటారని అన్నారు. బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ విద్యాబుద్ధులను నేర్పించే గురువులను గౌరవిస్తే జీవితం సన్మార్గంలో పయనిస్తుందని, గురువులపై భక్తిశ్రద్ధలను కలిగి ఉండాలన్నారు. గురువులను ప్రార్థించి, వారి ఆశీర్వాదాలు తీసుకోవాలన్నారు. బాపూజీ కమిటీ అధ్యక్షుడు సాధు శివ శంకర్ రావు, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చలమయ్య కళాశాలలో వేదవ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాల అలంకరించిన సూర్య నారాయణ, రామకృష్ణ ప్రభు తదితరులు

స్థలం కబ్జా చేశానంటూ దుష్ప్రచారం

మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు కిలారి రోశయ్య

నెహ్రూనగర్: జీటీ రోడ్డులో స్థలం కబ్జా చేసినని కొందరు నాపై దుష్ప్రచారం జరుగుతోందని జనసేన పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఖండించారు. ఈ మేరకు కృష్ణనగర్‌లోని కిలారి రోశయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013వ సంవత్సరంలో జీటీ రోడ్డులో ముందు భాగాన్ని 30 సంవత్సరాలకు లీజుకు తీసుకుని లీజ్ రిజిస్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. 2015లో సదరు స్థలంలో థియేటర్ నిర్మాణానికి తలపెట్టినప్పుడు ఫిర్యాదుదారులు హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో 2015లో డాక్యుమెంట్స్ పరిశీలను రావాలని జీఎంసీ అధికారులు కోరడంతో నా వద్ద ఉన్న డాక్యుమెంట్స్‌తో అధికారులను వెళ్లి కలిశానన్నారు. అప్పుడు డాక్యుమెంట్స్ చూపేందుకు ఫిర్యాదుదారులు రాకపోవడంతో అప్పటి అధికారులు నా వద్ద డాక్యుమెంట్స్‌ను పరిశీలించి థియేటర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని తెలియజేశారు. తిరిగి 2021లో ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు..అప్పుడు కూడా నేను ఎవరి స్థలం ఆక్రమించలేదని స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. ల్యాండ్ ఓనర్‌కు సంబంధం లేకుండా నేను స్థలం కబ్జా చేశానని ఎలా అంటారని ప్రశ్నించారు. ఫిర్యాదు దారుల వద్ద నిజమైన డాక్యుమెంట్స్ ఉంటే కోర్టులో తేల్చుకోకుండా ఇలా నా పై దుష్ప్రచారం కావాలని చేస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత హననానికి పాల్పడిన వారిపై క్రిమినల్, సివిల్ కేసులు పెట్టేందుకు సిద్ధమైనట్లుగా చెప్పారు.



మాట్లాడుతున్న కిలారి రోశయ్య

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తూ, నైపుణ్యాలను మెరుగుపరచుకునేలా శిక్షణ కల్పిస్తున్నామని, తద్వారా వారు ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు, జీవితంలో ఉన్నతమైన విజయాలను అందుకునేందుకు అవసరమైన సమగ్ర ప్రణాళికను తల్లిదండ్రుల సహకారంతో భవిష్యత్తులో రూపొందిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాష్యం విద్యాసంస్థల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, రెవెన్యూ సర్వేయర్ సునుల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యార్థుల సంక్షేమం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

విద్యాసంస్థల్లో పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం తల్లిదండ్రుల, అధ్యాపకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆర్జేడీ జె.పద్మ, ఆర్ఐవో జి.సునీత విద్యార్థినుల తల్లిదండ్రులతో కళాశాల అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్జేడీ పద్మ, ఆర్ఐఓ సునీత, ప్రిన్సిపాల్ ఉమాదేవి

శ్రీ మేధలో..

గుంటూరు ఎడ్యుకేషన్: కొత్తపేటలోని శ్రీమేధ కామర్స్ జూనియర్ కళాశాలలో గురువారం తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. శ్రీమేధ విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగుదలకు, ఉపాధ్యాయుల బోధనా పటిమను పెంపొందించుకునేందుకు ఆత్మీయ సమావేశం దోహద పడుతుందన్నారు. నిపుణ్ భారత్ లక్ష్యసాధనలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు భాగస్వాములై పిల్లల జీవితాల్లో మార్పులు తీసుకురావాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే దిశగా కళాశాలలను నిర్వహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామిశెట్టి వెంకట రమణదాస్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భరద్వాజ్, కె. అయ్యప్ప, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులు..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు తల్లిదండ్రులే మొదటి గురువులని ఆద్య పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. బ్రాడీపేట రెండోలైనులోని ఆద్య పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, తలిదండ్రుల సమావేశంతో పాటు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి నడింపల్లి గురుదత్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనీకుడు బొమ్మిడాల భానుమూర్తి

నగరంపాలెం: సంపూర్ణ వ్యక్తిత్వం మూర్తిభవించిన గొప్ప దార్శనికుడు బొమ్మిడాల భానుమూర్తి అని ఏపీ స్టేట్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ అన్నారు. బొమ్మిడాల భానుమూర్తి గ్రూపు కంపెనీల వ్యవస్థాపకులు బొమ్మిడాల భానుమూర్తి 94వ పుట్టినరోజు వేడుకలు గురువారం రింగ్‌రోడ్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాంతిప్రియ మాట్లాడుతూ ఏ సంస్థ అయినా అత్యున్నతంగా రాణించాలంటే, అందులోని ఉద్యోగుల కష్టించే మనస్తత్వం, యాజమాన్యం వారిని కన్న బిడ్డల్లా చూసుకునే వాతావరణం ఉండడం వల్ల సాధ్యమవుతుందని అన్నారు. వ్యాపారాల్లో కుటుంబ వారసత్వం కష్టపడేతత్వం ద్వారా బంధాలు బలోపేతమయ్యేందుకు దోహదపడతాయని చెప్పారు. సీఎస్ఆర్ డొనేషన్స్ అకడమిక్ ఉపకార వేతనాలు, చైర్మన్ ట్రోఫీ బెస్ట్ బిజినెస్ అవార్డు, ప్రత్యేక అవార్డులను చైర్మన్ భానుమూర్తి, శాంతి ప్రియ, డైరెక్టర్లు భావన్నారాయణ, కోటిరత్నం, రాజవరప్రసాద్, భానుప్రకాష్‌లు అందించారు. కార్యక్రమంలో పి.టి. కుమార్, బయో ఫార్మా హెడ్ సుధాకర్‌రెడ్డి, బ్రహ్మయ్య అండ్ కంపెనీ లక్ష్మణరావు,ఎస్.జ్యోతికుమార్, నళిన్ పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు.



టొబాకో బెస్ట్ బిజినెస్ చైర్మన్ అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్ బృందం

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మంచాల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం యూనియన్ బ్యాంక్ అందిస్తున్న వివిధ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని చేబ్రోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో జన సురక్ష ప్రోగ్రాం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రమేష్, రత్న కుమారి, రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

ఆక్రమణలను తొలగించండి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- కేవీపీ కాలనీ, జోసఫ్ నగర్, కావేరి కాలనీల్లో పర్యటన

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బందే తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కేవీపీ కాలనీ, జోసఫ్ నగర్, కావేరి కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల ఆక్రమణలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో త్వరలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయనున్నామని, ట్రాఫిక్‌కు, డ్రెయిన్‌లో వ్యర్థాలు తీయడానికి ఆటంకంగా ఉన్న రోడ్, డ్రెయిన్‌ల ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. ఆయా ఆక్రమణదారులు నగరపాలక సంస్థ ఏర్పాటు చేయనున్న వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసుకోవడానికి వెండింగ్ కార్డ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.



అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ

పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది తమ పరిధిలో ఆక్రమణదారులకు ఆక్రమణలు తొలగించుకోవాలని నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జోసఫ్ నగర్ ప్రజలు అనధికార నిర్మాణాలపై ఫిర్యాదు చేయగా నేరుగా పరిశీలించి, సదరు నిర్మాణాలకు నగరపాలక సంస్థ నుంచి అనుమతులు పరిశీలించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ప్రజలు రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో బహుళ అంతస్తు, ఇతర భవనాలు డ్రెయిన్లను కవర్ చేస్తూ రోడ్ల మీదకు ర్యాంప్‌లు నిర్మాణం చేయకుండా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈ వెంకట రమణ, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో అనధికార కట్టడాలను ఉపేక్షించం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్‌ని ఉపేక్షించేది లేదని, కేవలం నోటీసులకే పరిమితం కాకుండా నిర్మాణ దశలోనే చర్యలు ఉండాలని, అందుకు తగిన విధంగా సచివాలయ కార్యదర్శులు, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులకు స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్‌పై ప్రజలు, ప్రజా ప్రతినిధులు ద్వారా తమ దృష్టికి తీసుకువస్తున్నారని..వాటి నియంత్రణలో క్షేత్ర స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీలోపు సదరు అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్‌కు నోటీసులు ఇచ్చి, తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. జీఎంసీలో అధిక మొత్తంలో ఏళ్ల తరబడి కోర్ట్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని, కోర్ట్ కేసుల్లో కౌంటర్ల దాఖలు చేయడంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, సూపరింటెండెంట్, గుమాస్తాలు కోర్ట్ కేసుల్లో బాధ్యత తీసుకోవాలన్నారు. 18వ తేదీ నాటికి కౌంటర్లు దాఖలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు, టీపీఎస్‌లు, టీపీబీఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 219వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్, సాంబయ్య, యెహోషువా, ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయ్యిందని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రమాదేవి, దుర్గాంబ, గురవయ్య, పిచ్చయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత పరీక్షలు

తాడికొండ: బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం తుళ్లూరులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సీఈవో కృష్ణయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రికి ప్రతి రోజు 1500 మంది హైదరాబాద్‌కు క్యాన్సర్ చికిత్స నిమిత్తం విచ్చేస్తుంటారని.. పేషెంట్ వెంట ఉండేందుకు ఒక వ్యక్తికి వసతి అవకాశం కూడా ఇస్తున్నామన్నారు. స్థానికంగా మరో ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

26 నుంచి ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ

తాడేపల్లి రూరల్: ఈనెల 26 నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్స్ (శాప్ ఎస్‌డీ)లో శిక్షణ ఇవ్వనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాలో ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ కోర్సును పూర్తిగా ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com